# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నంలో జూన్ 21న నిర్వహించే యోగా దినోత్సవంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **విజయవాడలో ఈ సాయంత్రం జరిగే తిరంగా ర్యాలీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పాల్గొంటారు.**
3. **రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**
4. **క్షేత్రస్థాయిలో పీఎం సూర్యఘర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సూచించారు.**
5. **తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు.**

==========================

విశాఖపట్నంలో జూన్ 21వ తేదీన నిర్వహించే యోగా దినోత్సవంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహిహస్తున్న ఈ సమావేశంలో విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు, భద్రతపై సంబందిత అధికారులతో చర్చిస్తున్నారు. అలాగే క్వాంటమ్ వ్యాలీ... భవనాల నమూనాపై సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఈరోజు సాయంత్రం విజయవాడలో ఇందిరా గాంధీ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు జరిగే తిరంగా ర్యాలీలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

--------------------------

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో విజయవాడలో ఈరోజు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సాయంత్రం 5 గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్, బీజేపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి లతోపాటు పలువురు రాష్ట్ర మంత్రులు శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతాపల్లిలో రెన్యూ సంస్థ 22 వేల కోట్ల పెట్టుబడులతో నిర్మిస్తున్న పునర్ ఉత్పాదక విద్యుత్ కాంప్లెక్స్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టడం జరుగుతుందని అన్నారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఈ సోలార్ ప్రాజెక్ట్ చేపట్టడం జరిగిందని, ఈ ప్రాజెక్టు ద్వారా రైతులను ప్రోత్సాహిస్తూ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ...

...వాయిస్ .. 38 సెకన్లు

---------------------------

క్షేత్రస్థాయిలో పీఎం సూర్యఘర్ పై ప్రజల్లో అవగాహన కల్పించి.. పునరుత్పాదక విద్యుత్ వైపు ప్రోత్సహించాలని అధికారులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సూచించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ కోతలు, పీఎం సూర్యాఘర్, ఆర్డీఎస్ ఎస్ పనుల పురోగతిపై డిస్కంల సీఎండీలతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు మంజూరు చేసిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై చర్చించారు. వ్యవసాయ సీజన్ నాటికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి రైతుకీ.... విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిరంతరాయ విద్యుత్ అందించాలని నిర్దేశించారు. అత్యవసర సమయాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే... ప్రజలకు ముదుస్తు సమాచారం అందేలా చూడాలని మంత్రి తెలిపారు.

---------------------------

తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. విజయవాడలో బీసీ సంక్షేమ వసతిగృహాలు, మహాత్మా జ్యోతిబా ఫులే గురుకులాల నుంచి 2024-25 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం నిన్న సత్కరించింది. 185 మంది విద్యార్థులకు ప్రోత్సాహకాలు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా 28 బీసీ గురుకులాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

..వాయిస్.. 28 సెకన్లు

---------------------------

పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఈ ఉదయం తిరుపతిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎం.ఆర్.పల్లి సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు వెయ్యి అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నాయకులు.. జాతీయ జెండా పట్టుకొని ముందుకుసాగగా.. జాతీయ సమైక్యత, సమగ్రతను చాటేలా విద్యార్థులు గీతాలు ఆలపించారు.

---------------------------

దోమ కాటు వల్ల వ్యాప్తి చెందే డెంగీ జ్వరాన్ని నివారించడంలో ప్రజలలో చైతన్యం కలిగించే ఉద్దేశ్యంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పిలుపుమేరకు ఈరోజు దేశవ్యాప్తంగా "జాతీయ డెంగీ నివారణ దినం"గా పాటిస్తున్నారు. దోమల నివారణకు, దోమల వ్యాప్తిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్ధేశం.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఈరోజు దర్శించుకున్నారు. ఉదయం విఐపీ విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈనెల 18వ తేదీ పీఎస్ఎల్వీ సి61 రాకెట్ ద్వారా భూమి పరిశీలన శాటిలైట్‌ను గగనతలంలోకి పంపనున్నారు. ఈ ప్రయోగం విజయవంతం కావాలని రాకెట్ నమూనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో ఇస్రో చైర్మన్ నారాయణన్ కు వేదపండితులు వేద ఆశీర్వచనం అందించి.. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఇస్రో ఛైర్మన్ పాత్రికేయలతో మాట్లాడుతూ...

వాయిస్: 27 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మీ ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

మన దైనందిన జీవితంలో కాంతి నిర్వహిస్తున్న పాత్రను తెలియజేయడం ...., దాని సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన పెంచడం కోసం ఈరోజు అంతర్జాతీయ కాంతి దినోత్సవం నిర్వహిస్తున్నారు. అమెరికాకు చెందిన భౌతిక శాస్త్రవేత్త థియోడర్ మైమన్ 1960 వ సంవత్సరం మే 16 వ తేదీన మొదటిసారిగా లేజర్ ద్వారా కాంతి పుంజాన్ని ఆవిష్కరించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున అంతర్జాతీయ కాంతి దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్య రాజ్య సమితి పిలుపు నిచ్చింది. థియోడర్ మైమన్ చేసిన ఈ ఆవిష్కరణ వైద్య, రోగ నిర్ధారణ సాంకేతికతల ఆవిష్కరణకు దోహదం చేసింది. కాంతిని మనం సక్రమ రీతిలో వినియోగించుకోగలిగితే పర్యావరణ సమతుల్యానికి కూడా మేలు చేస్తుంది.

====================